క్లుప్తంగా

ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరి

కొండాపురం : జమ్మలమడుగు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈనెల చివరి వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉంటుందని సీఐ మహ్మద్‌రఫీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొండాపురం సర్కిల్ పరిధిలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టాలన్నా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన తెలిపారు. అనుమతి కోసం 24 గంటల ముందు పోలీస్‌స్టేషన్‌లో అర్జి ఇచ్చి ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు.

ఉపాధి పనులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఏపీవో సుధారాణి

వల్లూరు : 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ పరిధిలోని కూలీలు చేయడానికి సరిపడా పనులను గుర్తించాలని ఏపీవో సుధారాణి తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల గుర్తింపునకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనకు సమావేశాలను నిర్వహించారు. దిగువపల్లెలో సర్పంచ్ కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీవో పాల్గొని పనుల గుర్తింపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాగులు, సరుకులు పంపిణీ

పులివెందుల టౌన్ : ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ హాలులో బుధవారం నరేష్ విస్టేజ్ సంస్థ మేనేజర్ రమేష్‌బాబు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో కాటన్ బ్యాగులను దివ్యాంగులకు పంపిణీ చేశారు. అలాగే దివ్యాంగులకు సబ్బులు, పేస్టులు తదితరవి అందించారు. వికలాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజు మటన్, చికెన్ విక్రయాలు

కొండాపురం : అహింసను ఆయుధంగా చేసుకుని స్వతంత్ర్యం తెచ్చిన మహాత్ముడి గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం జంతువధ, మద్యం విక్రయాలను నిషేధించింది. మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరులోని నాలుగు వరసల జాతీయ రహదారి ప్రక్కనే చికెన్‌సెంటర్లు, మటన్ విక్రయాలు బుధవారం జోరుగా జరగాయి. పబ్లిక్‌గా విక్రయాలు చేయడంతో త నిఖీలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడాన్ని వాహనచోదకులు చర్చించుకున్నారు.

కలుషిత నీరు తాగి పలువురికి అస్వస్థత



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరు, నేతాజీ నగర్ ప్రాంతంలో కలుషితమైన నీరు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు ఇలా.. మున్సిపాలిటీ ద్వారా సురక్షిత మంచి నీరు సరఫరా చేసే పైపులైన్ నుంచి వచ్చే నీటిని మాత్రమే ప్రజలు తాగుతారు. మంగళవారం మున్సిపాలిటీ సరఫరా చేసిన మంచినీరు కలుషితమై రావడంతో స్థానిక ప్రజలు ఆ నీటినే తాగారు. పట్టణంలోని నేతాజీ నగర్, కన్నెలూరు ప్రాంతాల్లో ఉన్న దాదాపు 30 నుంచి 40 మంది పురుషులు, మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు వారిని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. పైప్‌లైన్ల ద్వారా వచ్చిన నీటిని పరీక్షల నిమిత్తం మున్సిపల్ అధికారులు తీసుకెళ్లారు.

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పరామర్శ

అస్వస్థతకు గురైన వారిని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి శుభ్రమైన నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హక్కుల కోసం పోరాటం చేస్తాం

జమ్మలమడుగు : లియాఫీ ఆధ్వర్యంలో ఏజెంట్ల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని లియాఫీ బ్రాంచ్ సెక్రెటరీ గురుశేఖర్ తెలిపారు. బుధవారం లియాఫీ 61వ ఆవిర్భావ దినోత్సవంతోపాటు గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఎల్ఐసీ కార్యాలయంలో మేనేజర్ వెంకటసుబ్బయ్య నివాళులు అర్పించారు.

పరిసరాల పరిశుభ్రత

పులివెందుల టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. బుధవారం జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా పులివెందుల స్టేట్ బ్యాంకు అసోసియేషన్, నెహ్రూ యువకేంద్రం, స్నేహిత అమృతహస్తం సేవాసమితిల ఆధ్వర్యంలో నిర్వ హించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. చీపుర్లు చేతపట్టి రోడ్లను శుభ్రం చేశారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



కమలాపురంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆర్టీపీపీలో నివాలర్పిస్తున్న సీఈ గౌరీపతి



జమ్మలమడుగులో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ పీఆర్



పాత ఎమ్మెల్యే కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మహాత్మాగాంధీ బాపూజీ కలలుకన్న స్వరాజ్యం రావాలని మున్సిపల్ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మగాంధీ చిత్రపటానికి ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డిలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, శ్రీరంగనాథస్వామి అలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సోపాల వీరా, శ్రీరాములు, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, రాజశేఖరరెడ్డి, ఖాదర్ బాషా, మహిళా కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముద్దనూరు రోడ్డులో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

కమలాపురంలో..

కమలాపురం : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం గాంధీజీ 155వ జయంతిని పురస్కరించుకుని పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ చేసిన పోరాటాలతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని ఆయన స్పష్టం చేశారు. గాంధీజీ ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సుధా కొండారెడ్డి, మస్తానయ్య, మైసూరారెడ్డి, దాసరి సురేష్, జెట్టి నగేష్, గఫార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి, కమిషనర్ జగన్నాథ్, పాలకవర్గం నివాళులర్పించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గాంధీని స్మరించుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ టీబీహెచ్‌ఎల్‌సీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, వెంకటేశ్ యాదవ్, వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరెడ్డి నివాళులు ఆర్పించారు. అలాగే పట్టణంలోని ఆర్యవైశ్యుల సంఘం అధ్యక్షుడు మల్లెం కొండు సుబ్రమణ్యం నివాళులు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు శరణావెంకటకిషోర్, యువజన సంఘం అధ్యక్షుడు బుశెట్టి సుమన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముద్దనూరులో

ముద్దనూరు : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ అభిమానులు జాతిపిత చిత్రపటానికి పూలమాలవేసి ఆయనకు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ముకుందరెడ్డి, స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌లు తమ సిబ్బందితో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన జాతికి చేసిన సేవలను కొనియాడారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరయ్యయాదవ్, జంగంరెడ్డి, ప్రతాప్‌యాదవ్, బ్రహ్మానందరెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో మహాత్మగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ప్రాజెక్టు కాన్ఫరెన్స్ కార్యాలయంలో సీఈ గౌరిపతి గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, పర్యవేక్షణ అధికారి అనూప్‌రాజు మీరా, సీనియర్ వేల్ఫేర్ అధికారి చార్లెస్, ఫ్యాక్టరీ మేజనేర ఎస్.సిద్దయ్య, యూనియన్ నాయకులు, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ మునేన్న, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో బుధవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పాల్గొని గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే ట్రిపుల్‌ఐటీలో రూ.40 కోట్లతో నిర్మిస్తూ అర్ధాంతరంగా ఆగిపోయిన ఆడిటోరియం భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, విద్యార్థుల సంక్షేమ అధికారి వెంకటేష్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త దీప్తి, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు. అలాగే పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

లింగాలలో

లింగాల : పెద్దకుడాల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో పులివెందుల లయోలా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. అంతకముందు పాఠశాలలో గాంధీజీ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రీడా మైదానంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆరోక్యరాజ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కళ్యాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోచమిరెడ్డి, నిరంజన్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపీ సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : ఎన్నికల సమయంలో అమలు చేయలేని సూపర్ సిక్స్ హామీలు చెప్పి అమలు చేయలేక సీఎం చంద్రబాబునాయుడు విఫలమయ్యాడని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం, చామలూరు గ్రామాల్లో ఆయన పర్యాటించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిత్యావసర వస్తువులు అధికంగా పెరిగాయని వాటిని నియంత్రిస్తానని చెప్పి మాయ మాటలు చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వంటనూనెలు విపరీతంగా పెంచి ప్రజలను మోసం చేశాడన్నారు. చదువుకునే పిల్లలకు తల్లికి వందనం కింద ఎంత మంది ఉంటే అంతమందికి ఇస్తానని చెప్పి ఇవ్వలేక పోయ్యారన్నారు. పింఛన్లు ఇవ్వలేక వికలాంగుల పింఛన్లు తొలంగించడం ఏమిటని ఆయన ఏద్దేవా చేశారు. మహిళలకు ఆర్టీసిలో ప్రయాణం ఫ్రీ అని అమలు చేయలేని హామీలు చెప్పి అమలు చేయడంలో విఫలమయ్యాడన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు చంద్రోశేఖర్‌రెడ్డి, చింత నవజ్యోత్‌రెడ్డి, కె.నాగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హరినారాయణరెడ్డి, రామిరెడ్డిపల్లె సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, నాగు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బుడ్డశనగ విత్తనాలకు నమోదు


వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 25 శాతం రాయితీతో బుడ్డశనగ విత్తన పంపిణీ నమోదు కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలానికి జేజే రకం 4078 క్వింటాళ్లు విత్తనం మంజూరైనట్లు తెలిపారు. 25 శాతం రాయితీతో అందజేస్తారన్నారు. క్వింటాల్ పూర్తి ధర రూ.9400 కాగా సబ్సిడీ రూ.2350 పోనూ రూ.7050 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక ఎకరాకు 40 కిలోల విత్తనాన్ని, అర ఎకరాకు 20 కిలోల ప్యాకెట్, ఎకరాకు రెండు 20 కేజీల ప్యాకెట్‌లు అందిస్తామన్నారు. గరిష్ఠంగా 5 ఎకరాల వరకు విత్తనాన్ని అందజేస్తామన్నారు.

శనగపంట సాగు చేసే రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ ఫోన్ తమ వెంట తీసుకుని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.

32 మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు

జమ్మలమడుగు : ఆంధ్రులందరూ కలిసికట్టుగా పోరాటం చేసి 32 మంది బలిదానంతో సాధించుకున్న పరిశ్రమ విశాఖ ఉక్కు అని అలాంటి ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ చేయడం ఆంధ్రుల మనో భావాలను దెబ్బతియడమే అవుతుందన్నారు. అదేవిధంగా సెయిల్ ఆధ్వర్యంలో కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు,

దేవస్థాన స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు



దేవస్థాన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న దేవస్థాన అధికారులు

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి 416 సర్వే నంబర్ 70 సెంట్ల స్థలాన్ని దేవస్థాన ఈవో విశ్వనాథరెడ్డి స్వాధీనం పరుచుకున్నారు. అక్రమణ దారులనుంచి కాపాడాలని కోరుతూ గతనెల 24వ తేదీన బీజేపీ, జనసేన నాయకులు దేవస్థానం ఈఓ విశ్వనాథరెడ్డిని కోరారు. ఈ నేపథ్యంలో జేసీబీ, డోజర్‌తో ఆ స్థలాన్ని శుభ్రం చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. త్వరలోనే స్థలానికి సర్వే చేయించి ఫెన్సింగ్ వేయిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు,

గృహ సముదాయ కార్యాచరణ

పులివెందుల టౌన్ : మాదిగ ఉద్యోగుల గృహ సముదాయ కార్యచరణ రూపొందించామని ఎమ్మార్పీఎస్ గౌరవ సలహాదారు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని గాంధీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంఈఎఫ్ నాయకులు హరి ఆధ్వర్యంలో ఏడు మండలాల మాదిగ సోదరుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం అందరూ భవిష్యత్ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఆర్థిక వనరుల సమీకరణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ట్రెజరర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లెలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం



వీధులను శుభ్రపరుస్తున్న యూసీఐఎల్ అధికారులు, గ్రామస్తులు

వేముల : మండలం తుమ్మలపల్లె గ్రామంలో బుధవారం జాతిపిత మహాత్మగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా యూసీఐఎల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూసీఐఎల్ మిల్లు డీజీఎం సు మన్ సర్కార్, యూసీఐఎల్ గని డీజీఎం కిశోర్ భగ త్‌ల నేతృత్వంలో స్పెషల్ పోలీస్ ఫోర్స్ ఉద్యోగు లు, కాలనీ వాసులు స్వచ్ఛతప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు తెల్లటి డ్రెస్ కోడ్ ధరించి తుమ్మలపల్లె కాలనీ, గెస్ట్ హౌస్, ఆసుపత్రి, రోడ్లు, మైదానాలలో చీపుర్లు చేతపట్టి శుభ్రపరిచారు. కార్యక్రమంలో యూసీఐఎల్ అధికారులు సి.మతివానన్, బి.శ్రీకాంత్, ఎల్.కోటేశ్వరరావు, జె.డి.కన్నన్, విపిన్‌కు మార్‌శర్మ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి అభివృద్ధి పనులను చేపట్టాలి

సింహాద్రిపురం : పల్లెప్రగతి కోసం, గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులు చేపట్టాలని నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కిశోర్‌రెడ్డి తెలిపారు. మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని హిమకుంట్ల సచివాలయంలో ఉపాధి హామీ గ్రామ సభను ఆయన నిర్వహించి మాట్లాడారు. రైతులకు సాగునీరు అందడానికి పీబీసీ కాలువలో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలన్నారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వరి, పంచాయతీ సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మహాత్మగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : కార్యకర్తలందరికీ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఆయన మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి గాంధీజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం తీసుకరావాలన్న లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సచివాలయ వ్యవస్థను తొలగించడం దారుణమన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ అడుగు జాడల్లో పయనించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, నూర్ బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు కిశోర్, చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పితృదేవతలకు సామూహిక పిండ ప్రదానం



సామూహిక పిండ ప్రదానంలో పాల్గొన్న వివిధ ప్రాంతాలవారు



ప్రత్యేక అలంకరణలో రుద్రపాదం

వల్లూరు : మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండపై పెన్నానది ఒడ్డున శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం సమీపంలోని రుద్రపాదం వద్ద బుధవారం పితృదేవతలకు సామూహిక పిండ ప్రధాన కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చిన వారు తమ పితృదేవతలకు పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు పిండ ప్రదానం చేయడం వలన కలిగే లాభాలను గురించి వివరించారు. పంచ నదీ సంగమమైన పినాకినీ నది తీరంలో అనేక యుగాలుగా వెలసిన రుద్రపాదం వద్ద పితృ దేవతలకు పిండ ప్రదానం నిర్వహించడం వలన పితృ దేవతలకు స్వర్గ ప్రాప్తి లభిస్తుందని అనేక పురాణాల్లో పేర్కొనబడిందని వివరించారు. దేవస్థానం తరుపున పిండ ప్రదాన సామగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అఖిల్ దీక్షితులు, సుమంత్ దీక్షితులు, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



కమలాపురం : ఆలయం ఎదుట ముస్తాబైన చలువ పందిల్లు



ముద్దనూరులో విద్యుదీపాలంకరణలో అమ్మవారి చిత్రం



ఎర్రగుంట్లలో ముస్తాబైన కన్యాకాపరమేశ్వరీ ఆలయం

కమలాపురం : పట్టణంలోని అమ్మవారు శాలలో వెలసిన శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవ రాత్రి మహోత్సావాలను ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కోశాధికారి మాలేపాటి మల్లికార్జున తెలిపారు. 11 రోజుల పాటు జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు మహిళలు, మహిళా మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. 3వ తేదీన అమ్మవారు దీక్షా బంధన అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేస్తారన్నారు. 4న అర్ధనారీశ్వరీదేవి అలంకారంలో, 5న రాజరాజేశ్వరీదేవీ అలంకారం, 6న గాయత్రీదేవి అంలకారం, 7న అన్నపూర్ణదేవి అలంకారం, 8వ తేదీన వైష్ణవిదేవి, 9న సరస్వతిదేవి(బిందెసేవ) అలంకారం, 10న దుర్గాదేవి (మహిశాసురమర్ధిని) అలంకారంలో, 11న కనక మహాలక్ష్మీదేవి అలంకారం, 12న విజయ దశమి(గ్రామోత్సవం) అలంకారంలో దర్శనమిస్తారన్నారు. 13వ తేదీన పాన్పుసేవ (వసంతోత్సవం) అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి దర్శనమిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. అలాగే భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

మహిళా మండలి ఆధ్వర్యంలో :

పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆర్యవైశ్య వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి ప్రెసిడెంటు మాలేపాటి లక్ష్మీదేవి తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి అమ్మవారికి కాలచక్ర ద్వీపపూజ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రతిరోజు రాత్రి 9 గంటలకు లక్కిడిప్ ద్వారా బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు.

ముద్దనూరు : స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం దసర ఉత్సవాలకు సిద్ధమైంది. నేటి నుంచి 10 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయ నిర్వాహకులు ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తిచేశారు. అమ్మవారి శాల వీధిలో విద్యుదీపాల అలంకరణ, ఆలయం ప్రాంగణాన్ని సుందరంగా ఏర్పాటుచేశారు.

ఎర్రగుంట్ల : మండలంలోని ఎర్రగుంట్ల, చిలంకూరు, ఆర్టీపీపీలలోని ఆలయాలలో శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం నుంచి అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమివ్వనున్నారు. పట్టణంలోని శ్రీమత్ కన్నకాపరమేశ్వరీదేవి ఆలయం, శ్రీ ఏరువాక గంగమ్మ ఆలయం, శ్రీచౌడేశ్వరీ ఆలయలం, మహేశ్వర్ కాలనీలోని శివాలయంలో, చిలంకూరులోని కన్యాకపరమేశ్వరీ ఆలయంలో, ఆర్టీపీపీలోని చౌడేశ్వరీ ఆలయంలో మహోత్సవాలు జరగనున్నాయి.

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గంగమ్మ, ఉరుటూరు చౌడమ్మ, గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరీదేవి, అనిమెల బోగాదమతల్లి, కీర్తిపల్లె నల్లనమ్మ ఆలయాల్లో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవార్ల భక్తులకు ఒక్కో రోజు ఒక్కో రూపంలో దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.